
సాక్షి
పల్నాడు
గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.0610 టీఎంసీలు. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 2000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,217 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

వైభవం మల్లేశ్వరుడి గ్రామోత్సవం

రుద్రాక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన స్వామి



మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం స్వామి వారు రుద్రాక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కూడళ్లలో భక్తులు మల్లేశ్వరుడిని దర్శించుకుని టెంకాయలు సమర్పించుకుని హారతులిచ్చారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన స్వామి గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా శాసన స్తంభం, పూలమార్కెట్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకుంది. అనంతరం అక్కడి నుంచి పెదకోనేరు మీదుగా తిరిగి దేవస్థానానికి చేరింది. నగరానికి చెందిన పొట్టి పానకాల గుప్తా, ఉదయ శ్రీనివాస్, మురళీకృష్ణ, ఉదయ్‌కుమార్, బాలగంగాధర్ గుప్తా, రంగ సత్యనారాయణ తదితరులు రుద్రాక్ష వాహన ఉత్సవానికి కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 556.90 అడుగుల వద్ద ఉంది. ఇది 225.2367 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 8,629, ప్రధాన కాలువకు 21,235, ఎస్‌ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 42,424 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 29,796 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 832.50 అడుగుల వద్ద ఉంది. ఇది 52.1476 టీఎంసీలకు సమానం.

యార్డులో 1,38,237 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,30,195 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,38,237 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 86,336 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దుర్గమ్మ సేవలో మంత్రి కారుమూరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. మంత్రి నాగేశ్వరరావు దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు మంత్రికి అందజేశారు.



అమరేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

పెండ్లి కుమారుడిగా అమరేశ్వరుడు

అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరారామంలో వేంచేసిఉన్న బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేదపండితులు, అర్చకులు అమరేశ్వరుడిని పెండ్లి కుమారుని చేశారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో బాలచాముండికా సమేత అమరేశ్వరునికి విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్త రాజావాసిరెడ్డి మురళీ కృష్ణ ప్రసాద్ తరఫున పీసపాటి అమరేశ్వరశర్మ నేతృత్వంలో స్వామివారికి ఊరేగింపుగా కల్యాణోత్సవ పట్టువస్త్రాలను సమర్పించారు. అమరేశ్వరునికి వేకువజామున అభిషేకం చేసి నూతన వస్త్రధారణతో పెండ్లి కుమారుని చేశారు. శ్రీశుభకృత్ నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి నుంచి ఫాల్గుణశుద్ధ విదియ వరకు పాంచాహ్నిక దీక్షతో నిర్వహించే ఈ కల్యాణోత్సవాలకు అర్చకులకు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ చేతుల మీదుగా దీక్షా వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నేడు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అమరేశ్వరుడికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, వాస్తుపూజ, వాస్తుహోమం, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ తెలిపారు.



పార్కింగ్ యాప్‌ను ప్రదర్శిస్తున్న ఐజీ త్రివిక్రమవర్మ, పక్కన ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

తిరునాళ్లకు భారీ బందోబస్తు

గుంటూరు రేంజ్ ఐజీ త్రివిక్రమవర్మ

సాక్షి, నరసరావుపేట: కోటప్పకొండ తిరునాళ్లకు పోలీస్‌శాఖ తరఫున అన్ని చర్యలు తీసుకున్నట్లు గుంటూరు రేంజ్ ఐజీ త్రివిక్రమవర్మ తెలిపారు. పల్నాడు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డితో కలసి తిరునాళ్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కోటప్పకొండకు ప్రభలు వచ్చే సమయంలో యడవల్లి, కమ్మవారిపాలెం జంక్షన్ల వద్ద హైవోల్టేజ్ విద్యుత్ వైర్లను తాత్కాలికంగా తొలగించాలని విద్యుత్ శాఖను కోరినట్లు చెప్పారు. యూటీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. 90 అడుగులు మించి వచ్చే విద్యుత్ ప్రభల వద్ద ఇద్దరు పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు. ప్రభల వద్ద రాజకీయ, కుల, వర్గాలకు సంబంధించిన పాటలు పెట్టడం నిషేధించినట్లు వెల్లడించారు. జాగ్రత్త చర్యలలో భాగంగా అనుమానితులను బైండోవర్ చేయనున్నట్లు తెలిపారు.

పార్కింగ్ యాప్..

ట్రాఫిక్ నియంత్రణకు ఎస్పీ రవిశంకర్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. తిరునాళ్లకు వచ్చే వాహనాల పార్కింగ్ కోసం జిల్లా పోలీసు శాఖ 'కోటప్పకొండ పార్కింగ్' అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించిందన్నారు. ఈ యాప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐజీ కోరారు. ఈ యాప్‌లో ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, బస్సులకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల గురించిన సమాచారం ఉంటుందని తెలిపారు.


ఎస్‌ఐ పరీక్షలకు తగిన బందోబస్తు..

శనివారం రాత్రి కోటప్పకొండలో బందోబస్తు పూర్తి అయిన వెంటనే పోలీస్ సిబ్బందిని ఆదివారం నిర్వహించనున్న ఎస్‌ఐ రాతపరీక్షకు వినియోగించడం జరుగుతుందని ఐజీ తెలిపారు. మూడు జిల్లాల పరిధిలో 30 వేల మంది పరీక్ష రాయనుండగా అందులో గుంటూరు నగరంలో 23 కేంద్రాల పరిధిలో 14,700 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో వెల్ఫేర్ క్యాంటీన్, కూరగాయల గార్డెన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బిందుమాధవ్, రామచంద్రరాజు పాల్గొన్నారు.

ముస్తాబైన కోటప్పకొండ

- నేటి నుంచి తిరునాళ్ల సందడి
- మూడు రోజుల పాటు భక్తుల రాక
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికారులు
- అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

నరసరావుపేట రూరల్: ఏకాదశి పర్వదినానికి కోటప్పకొండపై కొలువుదీరిన త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ముస్తాబయింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండపై ఈ నెల 18వ తేదీ నిర్వహించే తిరునాళ్ల మహోత్సవానికి 16వ తేదీ ఏకాదశి నుంచి భక్తుల రాక ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లు పూర్తిచేసాయి.



త్రికోటేశ్వరస్వామి దేవస్థానం

ఆరు క్యూలైన్‌ల్లో భక్తులకు దర్శనం..

తిరునాళ్లను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ గాలిగోపురం, స్వాగత ద్వారాలతో పాటు మహాగణపతి, విష్ణు, బ్రహ్మ విగ్రహాలకు రంగులు వేయడంతో నూతన శోభను సంతరించుకుంది. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.200, రూ.500, అభిషేక దర్శనం, వీఐపీ దర్శనం క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా మూలవిరాట్ అభిషేకాలు గురువారం నిలిపివేశారు. అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. అభిషేకం చేయించుకున్న భక్తులకు దర్శనం కల్పిస్తారు. భక్తుల కోసం చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, మజ్జిగ అందించనున్నారు. భక్తులకు అందించేందుకు స్వామివారి ప్రసాదాలైన లడ్డూ, అరిసెలను సిద్ధం చేశారు. కొండ దిగువున చిలకలూరిపేట మేజర్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏర్పాట్లు చేసింది. కోటప్పకొండకు నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి నడిపేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను సిద్ధం చేసింది.

రేపు ప్రారంభోత్సవాలు..

ఆలయ ప్రాంగణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నారు. రూ.1.6 కోట్లతో నిర్మించిన అన్నదాన మండపం, రూ.40 లక్షలతో ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు, రూ.40 లక్షలతో నిర్మించిన డార్మెంటరీ, రూ.75 లక్షలతో చేపట్టిన వసతి గృహాల ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. ఆయా భవనాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించనున్నారు.

రహదారులు సిద్ధం..

కొండకు వచ్చే రహదారులకు మరమ్మతు పనులు పూర్తి చేశారు. నరసరావుపేట– కోటప్పకొండ, కోటప్పకొండ–పమిడిమర్రు, పమిడిమర్రు–కాకాని రోడ్లను నూతనంగా నిర్మించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. యల్లమంద వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం కారణంగా ప్రభలు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అర్‌అండ్‌బీ అధికారులు అప్రోచ్ రోడ్డును పూర్తిచేశారు. భారీ వాహనాలు కూడా ప్రయాణించేలా బీటీ రోడ్డును నిర్మించారు. ఈ ఏడాది అటవీ శాఖ తిరునాళ్లకు వచ్చే భక్తులకు మొక్క ప్రసాదాన్ని అందించనుంది.



నిర్మాణం పూర్తిచేసుకున్న నరసరావుపేట - పమిడిమర్రు రహదారి



పిల్లల పార్క్‌లోని కాళింది మడుగు


ఆనందరూపం.. అర్ధనారీశ్వరం

- దేశంలో తొలి విలక్షణ అర్ధనారీశ్వర శివలింగం
- పెదకొండూరులో క్రీ.శ. 4వ శతాబ్దిలో నిర్మాణం
- ఈశ్వరతత్వానికి ప్రతీక
- 1700 సంవత్సరాల క్రితం మలిచిన శివరూపం

తెనాలి: శిరస్సుపై నాగాభరణం.. దిగువన అర్ధనారీశ్వర రూపం.. కుడివైపున కపాలముల మాల, త్రిశూలం, చెవికి సర్పకుండలం ధరించిన శివరూపం. ఎడమవైపు సగాన అందెలు, పూలమాల, చేతులకు కంకణాలు వంటి అలంకారంపై పార్వతి రూపం. మొత్తంమీద.. శివుడు పార్వతీ సమేతుడై ఆవిర్భవించినట్టు అక్కడి శివలింగం దర్శనమిస్తోంది. పార్వతీదేవికి శివుడిపై గల ప్రేమకు పరమావధి భర్త శరీరంలో సగభాగాన్ని పొందటమే. అందువల్లే ఈ శివలింగం సార్థకనామం కలదిగా చరిత్రకారుల భావన.

విలక్షణ శివలింగం..

శివలింగాలు నిరాకారంగా నిర్గుణసూచకంగా ఉండాలనే శైవాగమ శాస్త్రానికి భిన్నంగా విలక్షణమైన ఈ అర్ధనారీశ్వర శివలింగం, పవిత్ర కృష్ణానదీ తీరాన దుగ్గిరాల మండల గ్రామం పెదకొండూరులోగల ఆనందేశ్వరాలయంలో కొలువైఉంది. వేదాంతపరంగా చూస్తే, ఇందులో శివశక్తుల రూపం అద్వైత భావనకు ప్రతీకగా ఈశ్వరతత్వాన్ని చూపినట్టు చెబుతారు. శివాద్వైతం– శాక్తాద్వైతం ఇందులో మిళితమై ఉన్నాయి. శక్తి ఈశ్వరుడిలో మిళితమై ఉన్నప్పుడు ఈశ్వరాద్వైతమే మిగులుతుందని చెబుతారు. క్రీ.శ.4వ శతాబ్దినాటిది అంటే 1700 ఏళ్లనాటి ఈ విలక్షణ శివలింగం దేశంలోనే తొలిదని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వెల్లడించారు.



అర్ధనారీశ్వర శివలింగం



విగ్రహం వద్ద డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

పాలరాతితో మలచిన రూపు

ఈ శిల్పం ఉనికిని గురించి ప్రముఖ చరిత్రకారుడు పీవీ పరబ్రహ్మశాస్త్రి గతంలో ఇచ్చిన సమాచారం ప్రకారం బుధవారం డాక్టర్ శివనాగిరెడ్డి బుధవారం ఆలయాన్ని సందర్శించారు. అక్కడి శాసనాలను చదివి వివరాలను వెల్లడించారు. క్రీ.శ. 4వ శతాబ్దిలో గుంటూరు జిల్లా చేజర్ల, కంతేరుల నుంచి ఈ ప్రాంతాన్ని పాలించిన ఆనంద గోత్రినులనే రాజులు, పెదకొండూరులో ఆనందేశ్వరాలయాన్ని నిర్మించారు. పల్నాటి సున్నపురాతి శివలింగంపై ముందుభాగాన సగం శివుడు, సగం పార్వతిని ప్రకృతి, పురుషుల కలయికగా అర్ధనారీశ్వర శిల్పాన్ని చెక్కించారు. అర్ధనారీశ్వర శిల్పమున్న ఈ శివలింగం దేశంలోనే మొదటిదన్నారు. బౌద్ధమతానికి ప్రతీకగా శైవమతాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చిన 4వ శతాబ్దిలోనే దీనిని నిర్మించినట్టు తెలిపారు. బౌద్ధ విగ్రహాల నిర్మాణాలకు వినియోగించిన పాలరాతితో ఈ శివలింగాన్ని మలిచారు. అమరావతి బౌద్ధశిల్పాలు, అమరేశ్వరస్వామి, ఆ ప్రాంతంలోని మరికొన్ని శిల్పఖండాలు ఇదే తెల్లరాతితో రూపొందించారు. పెదకొండూరు ప్రాంతంలో ఆనందేశ్వరుడు మినహా మరే తెల్లరాతి విగ్రహం లేదు.

చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియజెప్పాలి

ఆలయ ప్రాంగణంలో క్రీ.శ. 12వ శతాబ్దినాటి బ్రహ్మ, సరస్వతి, మహిషాసురమర్దిని, సూర్యవిగ్రహాలు, క్రీ.శ. 1170, 1173, 1317 నాటి శాసనాలున్నాయి. ఆ శాసనాలను పీఠాలపై నిలబెట్టి వాటి చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియజెప్పే నామఫలకాన్ని ఏర్పాటు చేయాలని డాక్టర్ శివనాగిరెడ్డి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తరగని ఆస్తి విద్య

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: విద్య తరగని ఆస్తి అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక బడ్జెట్‌ను కేటాయించి పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారని గుర్తుచేశారు. ప్రకాష్‌నగర్‌లోని సెయింటాన్స్ పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏఏ మధుకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వాలకు భిన్నంగా విద్యారంగంపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ఇంగ్లిష్ మీడియం విద్యకు శ్రీకారం చుట్టారని తెలిపారు. విద్యారంగంపై రూ.25 వేల కోట్లు కేటాయించటం గొప్ప విషయమని తెలిపారు. దాదాపు 140 వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ బాబు, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఈఎం స్వామి, షేక్ ఖాజావలి, ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, వీరప్పయ్య, పాఠశాల కరస్పాండెంట్ అంథోనిమేరి, హెచ్‌ఎం విక్టోరియా, నిర్వాహక కమిటీ సభ్యులు వి.ఒక్కిరెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, బి.సీతారామయ్య, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, షేక్ గౌసిల్ మీరా తదితరులు పాల్గొన్నారు.



ప్రయోగ నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ప్రతి పరిణామం ప్రపంచంపై ప్రభావం

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- 'సమకాలీన అంతర్జాతీయం' పుస్తకావిష్కరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయంగా ఏ దేశంలో ఎటువంటి ఘటన చోటు చేసుకున్నా అవి ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ ముద్రించిన బుడ్డిగ జమిందార్ రచన 'సమకాలీన అంతర్జాతీయం' పుస్తకావిష్కరణ విజయవాడ పుస్తక మహోత్సవంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై బుధవారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. వివిధ దేశాల్లో జరిగే ప్రతి పరిణామం ఇతర దేశంపై ప్రభావం చూపుతుందని చెప్పారు. కరోనా నేపథ్యంలో అమెరికాలో చోటు చేసుకున్న ఆర్థిక మాంద్యం ప్రపంచ వ్యాప్తంగా జాబ్‌మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేసిందని తెలిపారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య జరిగిన యుద్ధంతో ఆయిల్, ఇతర ఆహార దినుసుల ధరలపై ప్రభావాన్ని చూపిందన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా చోటు చేసుకున్న అంశాలపై రాసిన వ్యాసాల సంపుటిని 'సమకాలీన అంతర్జాతీయం' పేరుతో పుస్తకంగా తీసుకురావటం అభినందనీయమన్నారు. పుస్తక సమీక్ష చేసిన వీక్షణం సంపాదకులు వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా చోటు చేసుకుంటున్న చాలా విషయాలను రచయిత ఈ పుస్తకంలో వివరించే ప్రయత్నం చేశారన్నారు. సాధారణంగా సరిహద్దు ప్రాంతాల్లో ఏమి జరుగుతుందో ఎవరికీ స్పష్టత ఉండదన్నారు. అక్కడి ప్రభుత్వాలు ఇచ్చే ప్రకటనలతోనే సమాచారం అందుతుందన్నారు. కానీ రచయిత తన సత్యాన్వేషణ సాగించి చాలా అంశాలను ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేశారన్నారు. రచయిత జమీందర్ మాట్లాడుతూ వివిధ దేశాల్లో నివసించిన తాను కొద్ది సంవత్సరాలుగా పరిశోధనాత్మకంగా ముందుకు సాగుతూ పలు అంతర్జాతీయ అంశాలపై పత్రికలకు వ్యాసాలను రాశానన్నారు. వాటికి సంబంధించి 2020 వరకూ వచ్చిన వ్యాసాలను పుస్తక రూపంలో తీసుకొచ్చానన్నారు. విశాలాంధ్ర పబ్లిషర్స్ డీజీఎం మనోహరనాయుడు నిర్వహించారు.

'డిసెంబ్రిష్టు ఖైదీ' నవల ఆవిష్కరణ

రష్యాలో గడిచిన రెండు శతాబ్దాల్లో జరిగిన అనేక పోరాటాలకు డిసెంబ్రిష్టు ఉద్యమం ప్రేరణగా నిలిచిందని వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ తెలిపారు. సాహితీవేత్త ఎస్‌వీఎస్ నాగభూషణ్ రచించిన 'డిసెంబ్రిష్టు ఖైదీ' (రష్యా చారిత్రక తెలుగు నవల) పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రష్యా జీవితాన్ని ఆధారంగా చేసుకొని ఇప్పటి వరకూ ఏ సాహిత్య గ్రంథం తెలుగులో నేరుగా రాలేదన్నారు. అది కేవలం 'డిసెంబ్రిష్టు ఖైదీ' మొట్టమొదటి గ్రంథమని పేర్కొన్నారు. 1825లో రష్యాలో జార్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి సంబంధించిన విషయాలను తీసుకొని రచయిత అద్భుతంగా ఈ గ్రంథాన్ని తీసుకొచ్చారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర నేత అక్కినేని వనజ మాట్లాడుతూ రష్యాలో రెండు వందల సంవత్సరాల క్రితం చోటు చేసుకున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలకు సంబంధించిన అక్షర రూపం ఈ నవల అన్నారు. రచయిత నాగభూషణ్ గొప్ప ప్రయోగాన్ని చేసి గ్రంథాన్ని తీసుకొచ్చారన్నారు. కార్యక్రమానికి డి.రమేష్‌పట్నాయక్ అధ్యక్షత వహించారు. కె.కృష్ణయ్య పర్యవేక్షించారు. రచయిత నాగభూషణ్ స్పందించి రచన సాగిన తీరును వివరించారు.

అదనంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఎంపీ లావు వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ లావు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని గురజాల, మాచర్ల ప్రాజెక్టు పరిధిల్లో అదనంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీకి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం అభ్యర్థించారు. ఢిల్లీలో ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గురజాల ప్రాజెక్టులోని దుర్గి, కారంపూడి మండలాలకు సంబంధించి మొత్తం ఒక లక్షకు పైగా జనాభా ఉంటే ప్రస్తుతం 95 అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రమే ఉన్నాయన్నారు. నూతనంగా దుర్గిలో మూడు, కారంపూడిలో రెండు అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని వివరించారు. మాచర్ల ప్రాజెక్టులోని మాచర్ల మున్సిపాలిటీ, మాచర్ల, రెంటచింతల, వెల్దుర్తి మండలాల్లో 2.10లక్షలకు పైగా జనాభా ఉంటే ప్రస్తుతం 172 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. జనాభాకు తగ్గట్లుగా మాచర్ల మున్సిపాలిటీకి మరో 39, రెంటచింతల మండలానికి 8 కేంద్రాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ విషయాలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): భర్త హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వినుకొండ పట్టణ సీఐ బి.అశోక్‌కుమార్ తెలిపిన వివరాలు... మసీదు మాన్యంలో శ్రీగిరి కుమార్(38), భార్య స్వాతి నివసం ఉంటున్నారు. అయితే భార్యాభర్తల మధ్య విభేదాలతో భార్య ఆమె ప్రియుడు మారుతిబాబు కలసి ఈ నెల 11వ తేదీ రాత్రి మెడకు తాడు బిగించి హత్య చేశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వివాహేతర సంబంధానికి భర్త అడ్డువస్తున్నాడని పథకం ప్రకారం హత్య చేసినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నారని వెల్లడించారు.

టెన్నిస్ విజేతలకు బహుమతులు ప్రదానం



నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–17, అండర్–19 టెన్నిస్ పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. ఫెడరేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ వైద్యులు డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, డాక్టర్ సురా ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పోటీల పరిశీలకులు టి.లక్ష్మీపతి, ఎం.పినాక పాణి, వ్యాయామ ఉపాధ్యాయులు పులి.శ్రీనివాసరావు, శివరాత్రి సుబ్రమణ్యం, షేక్.గౌస్, ఇజ్రాయేల్‌ప్రసాద్ పాల్గొన్నారు.

విజేతల వివరాలు

అండర్–19 బాలుర విభాగంలో.. శ్రీరామ ప్రణీత్‌వర్మ, కె.ఎస్.ఎస్.శంకర్(తూర్పుగోదావరి), బి.లీలాగణేష్(చిత్తూరు), మహేందర్‌రెడ్డి(వైఎస్సార్ కడప), ఆర్.వెంకటభార్గవ్(అనంతపురం). **అండర్–17 విభాగంలో..** ఎ.నిషత్(విశాఖ), కరుణకుమార్, ఆర్.విశాల్‌రాజ్(చిత్తూరు), పి.శివాజీ, డి.నిశాంత్(తూర్పుగోదావరి). **అండర్–19 బాలికల విభాగంలో..** భూవి శేఖర్(విశాఖ), జ్యోత్స్న, ఎస్.విధిత(చిత్తూరు), ఇతిక(కృష్ణా), బి.దివిష(తూర్పుగోదావరి).

కాలువలో పడి లస్కర్ దుర్మరణం



చిన వీరభద్రుడు

రొంపిచర్ల: మండలంలో బుచ్చిపాపన్నపాలెం, ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామాల మధ్య ఉన్న కాలువలో పడి లస్కర్ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని సంతగుడిపాడుకు చెందిన కొనికి చినవీరభద్రుడు(56) లస్కర్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా మండలంలో బుచ్చిపాపన్నపాలెం– ముప్పాళ్ల గ్రామాల మధ్య ఉన్న కాలువ వద్దకు వెళ్ళగా దురదృష్టవశాత్తు కాలువలో పడి మృతి చెందారు. పొలాలకు వెళ్లిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని ఆధారాలను పరిశీలించి లస్కర్ కొనికి చినవీరభద్రుడు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్. సురేష్ బాబు తెలిపారు.

బజరంగ్ ఫౌండేషన్ సేవలు అమూల్యం

- పోలీస్ కుటుంబాలకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు అభినందనీయం
- శిబిర ప్రారంభోత్సవంలో గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ సుప్రజ



కంటి పరీక్ష చేయించుకుంటున్న అడిషనల్ ఎస్పీ సుప్రజ, చిత్రంలో బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



ఉచిత కంటి పరీక్ష, కళ్లజోళ్ల పంపిణీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): నిజమైన సేవకు భాష్యం చెబుతూ, నిండైన మానవత్వం చాటుకుంటూ మెండైన సేవలందిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ కృషి అనన్య సామాన్యమని గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) సుప్రజ అన్నారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలీసులు, వారి కుటుంబాల కోసం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర పరీక్ష శిబిరాన్ని బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ(క్రైం) అనిల్, జిల్లా అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) శ్రీనివాసరావులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రజ మాట్లాడుతూ బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో వినూత్న రీతిలో ఉన్నాయని కొనియాడారు. సమాజ హితం కోసం ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, తలసేమియా పీడితుల కోసం మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఫౌండేషన్ పోలీసుల కుటుంబాల కోసం ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వ్యక్తిత్వాన్ని, దయా హృదయాన్ని కొనియాడారు. భవిష్యత్తులో పోలీసుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితోనే...

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో చేపడుతున్న 'జగన్నామ సంక్షేమ సంవత్సరం' సేవా కార్యక్రమాల పరంపర కొనసాగుతోందని చెప్పారు. విధి నిర్వహణలో తమ జీవితాలను అంకితం చేస్తున్న పోలీసులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన నేత్ర వైద్య పరీక్ష శిబిరానికి భారీగా హాజరై, సద్వినియోగం చేసుకున్నందుకు పోలీసు కుటుంబాలకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో ప్రారంభమైన 'బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరం'లో గ్రామీణ ప్రాంతాలకు సేవలను విస్తరించి, ఏడాది చివరి నాటికి 51 గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలను పూర్తి చేసి సాధ్యమైనంత ఎక్కువమందిని భాగస్వాములను చేయాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో అనుక్షణం శ్రమించే పోలీసు సోదరులకు స్నేహహస్తాన్ని అందించడానికి బజరంగ్‌ఫౌండేషన్ సిద్ధంగా ఉందని, రాబోయే రోజుల్లో పోలీసు శాఖ ఏదైనా గ్రామంలో అవగాహన కార్యక్రమాలు లేదా సేవా కార్యక్రమాలు చేపట్టే సందర్భంలో ఆ బాధ్యతను బజరంగ్ ఫౌండేషన్ స్వీకరించడానికి ముందంజలో ఉంటుందని తెలిపారు. పోలీసు కుటుంబాలలోని మహిళలకు కూడా బజరంగ్ నారీ రుతువు కార్యక్రమం ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. 1056 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు చేయడం జరిగిందని, అవసరం ఉన్న వారికి ఈ నెల 22వ తేదీ సాయంత్రం 3.30 గంటలకు కళ్లజోళ్లను అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే బజరంగ్ నారీ రుతువు కింద 376 మంది మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు శానిటరీ నాప్‌కిన్ల పంపకం చేయడం జరిగిందని వివరించారు. అనివార్య కారణాల వల్ల రాలేక పోయిన జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ప్రత్యేక అభినందనలు, సందేశాన్ని పంపించారని ఆయన తెలిపారు.

ప్రతిభకు మార్కులు కొలమానం కాదు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ప్రతిభకు మార్కులు కొలమానం కాదని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ ఎయిడెడ్ బాలికోన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి విద్యా–వైజ్ఞానిక ప్రదర్శన–2023 బుధవారం ముగిసింది. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ పాఠశాల విద్యలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తున్న ప్రభుత్వం గ్రంథాలయ వ్యవస్థలో డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టిందని చెప్పారు.

ఉత్తమ ప్రాజెక్టుల ఎంపిక

జిల్లాస్థాయిలో ప్రదర్శించిన 85 ప్రాజెక్టుల్లో ఐదు అంశాల వారీగా ఉత్తమమైన 10 ప్రాజెక్టుల్ని న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. వీటిని ఈనెల 27,28వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను జేసీ రాజకుమారి, మందపాటి శేషగిరిరావు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఆర్జేడీ వి.ఎస్. సుబ్బారావు, డీఈవో పి.శైలజ, డీవైఈవో కె. సుధాకర్‌రెడ్డి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం, ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ అందజేశారు. న్యాయనిర్ణేతలుగా వచ్చిన ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకులు పి.అరుణ, ఎస్. అంకమ్మ, పి. లత పాల్గొన్నారు.

సీఎం అండతో సహకార బ్యాంకుల బలోపేతం

డీసీసీబీ చైర్మన్ లాలుపురం రాము



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ లాలుపురం రాము

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అండతో సహకార బ్యాంకుల్ని బలోపేతం చేస్తున్నట్లు గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము తెలిపారు. బ్రాడీపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ రాము అధ్యక్షతన మహాజన సభ సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి టి.కృష్ణవేణి 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ సభలో ప్రవేశపెట్టిన అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 10 తీర్మానాల్ని ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. పలువురు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యులు మాట్లాడుతూ రైతుల నుంచి వసూలు చేసే షేర్ ధనం శాతాన్ని 10 నుంచి ఐదుకు తగ్గించాలని కోరారు. బ్యాంక్ చైర్మన్ రాము మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆప్కాబ్ సహకారంతో ప్రతి మండలానికి బ్రాంచిని ఏర్పాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి, జీఎం శేషభాను పాల్గొన్నారు.

ఘనంగా పీఆర్కే జన్మదిన వేడుకలు

భారీగా తరలివచ్చి, శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే, పక్కన పీవీఆర్, తండ్రి వెంకటేశ్వరరెడ్డి

మాచర్ల: వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) జన్మదిన వేడుకలు నియోజకవర్గం, పట్టణంలోని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచే అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు క్యాంపు కార్యాలయం వద్ద బారులు తీరి పీఆర్కేకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆయన తండ్రి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కుర్రి సాయి మార్కొండారెడ్డి, సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, పోలూరి నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీల మధ్య ఎమ్మెల్యే పిన్నెల్లి భారీ కేక్ కట్ చేసి, జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కారంపూడి మండలం కాచవరం గ్రామ నాయకులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామన బోయిన కోటయ్యతోపాటు ఆయా గ్రామాలకు చెందిన వారు కేకులు తీసుకొచ్చి, పీఆర్కేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు.

ఇక అక్కడి నుంచి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి 31వ వార్డులో కందుకూరి రత్నరాజు, కంభంపాటి మోషే, శ్రీనివాస్, కొత్తమీర కొండలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, పులిహోర పంపిణీ చేశారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయానికి చేరుకున్న పీఆర్కే, పీవీఆర్‌లకు వందలాది మంది పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కేక్ కట్ చేసిన ఎమ్మెల్యేను శుభాకాంక్షలు తెలిపి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సెయింట్ ఆన్స్ చిన్న కాన్వెంట్ వద్ద పీఆర్కేకు ఘన స్వాగతం పలికి, కేక్ కట్ చేయించారు. వేముల దుర్గ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి, సత్కరించారు. సాగర్ రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పీఆర్కే కేక్ కట్ చేశారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శేరెడ్డి గోపిరెడ్డి, మేకల కోటిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు తురకా కిషోర్, బత్తుల ఏడుకొండలు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చల్లా శ్రీను, జిల్లా వెలుగు ప్రాజెక్టు అధికారి బాబు నాయక్, ఆర్డీఓ శేషారెడ్డి, పోలీసు అధికారులు టి.మధు బాబు, తహసీల్దార్లు, మండల పరిషత్, వెలుగు జిల్లా అధికారులు, పార్టీ జిల్లా నాయకులు శ్రీనివాసశర్మ, జూలకంటి వీరారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీలు బూడిద శ్రీను, దాసరి చౌడేశ్వరి, చింతా శివరామయ్య, సునీత సాయిశంకర్, జెడ్పీటీసీ మల్లుస్వామి, నాయకులు పంగులూరి లక్ష్మయ్య, పీఎస్ఆర్ ఆంజనేయులు, ప్రసాద్, బూడిద సైదులు తదితరులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

పోటాపోటీగా ఎడ్ల బలప్రదర్శన

విజేతగా రంగారెడ్డి జిల్లా ఎద్దు



జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతిని గెలుపొందిన రంగారెడ్డి జిల్లా ఎడ్ల బలప్రదర్శన



విజేతకు బహుమతి అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి

సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రి సందర్భంగా సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం సమీపంలోని శ్రీశివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రంలో నిర్వహిస్తున్న జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బండలాగు ప్రదర్శన పోటీలు బుధవారం పోటాపోటీగా జరిగాయి. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం తుర్కంపల్లి గ్రామానికి చెందిన డి.రోషన్‌బాబు ఎద్దులు 3,149.3 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50 వేలు గెలుపొందింది. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం ఘంటసాల గ్రామానికి చెందిన మేకా కృష్ణమోహన్, బాపట్ల జిల్లా మార్టూరు మండలం, మార్టూరు గ్రామానికి చెందిన పోపూరి శ్రీనివాసరావు కంబైండ్ ఎడ్లు 2,906.8 అడుగుల దూరం లాగి రెండో బహుమతి కింద రూ.40 వేలు దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషజ్ఞారెడ్డి, జశ్వితరెడ్డి, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం, కొణిదెన రాజుపాలెం గ్రామానికి చెందిన ఏలూరి గణేష్ చౌదరి కంబైండ్ ఎడ్లు 2,824.7 అడుగుల దూరంలాగి మూడో బహుమతి కింద రూ.30 వేలు అందుకున్నాయి. గుంటూరు రూరల్ మండలం, లింగాయపాలెం గ్రామానికి చెందిన యల్లం సాంబశివరావు ఎద్దులు 2,702.0 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతి కింద రూ.20 వేలు, సాంబశివరావుకే చెందిన మరో ఎడ్ల జత ఐదో బహుమతి కింద రూ.15 వేలు గెలుచుకున్నారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం మండాది గ్రామానికి చెందిన పులి వెంకటరెడ్డి ఎద్దులు 2,232.9 అడుగులు లాగి 6వ బహుమతి రూ.12 వేలు, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం, యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన కళ్ళం జ్ఞానప్రదీప్ ఎద్దులు 2,195.6 అడుగుల దూరం లాగి ఏడో బహుమతి రూ.10 వేలు గెలుచుకున్నాయి. కమిటీ సభ్యులు పులి ఓబుల్ రెడ్డి, యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, పత్తి కోటిరెడ్డి, గోగుల వెంకటేశ్వరరెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, చింతా శివారెడ్డి, గాదె వీరారెడ్డి, సిద్దవటం శివారెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి పర్యవేక్షించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్సిరెడ్డి, కొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచి వెన్నాలింగారెడ్డి, కొంతిరెడ్డి పెద్ద నర్సిరెడ్డి, పమ్మి శ్రీనివాసరెడ్డి, పేరం అశోక్‌రెడ్డి, గాదె నాగిరెడ్డి, మద్దిగపు క్రిష్ణ మోహన్‌రెడ్డి, చిన్నపురెడ్డి వెంకటేశ్వరెడ్డి విజేతలైన ఎడ్ల యజమానులకు వరుసగా బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షులు పశర్లపాడు బ్రహ్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, నెవలి సీతారామిరెడ్డి పాల్గొన్నారు.